ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
సోమవారం 18 మార్చి 2024



ముందస్తు ప్రణాళికతోనే ప్రశాంతంగా ఎన్నికలు : సీపీ
8లో..
ఓసీపీ-3ని సందర్శించిన కోల్ సెక్రెటరీ

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:25 సోమవారం
సహర్ 4:53 మంగళవారం



చౌరస్తా - శివాజీనగర్ రహదారిలో క్వార్టర్ల పక్కనే ఉన్న దుకాణాలు

మేదరిబస్తీకి వెళ్లే రోడ్డు పక్కన క్వార్టర్ల పక్కనే ఉన్న దుకాణాలు

ఉపాధి కల్పనకు కసరత్తు

- రామగుండం మార్కెట్ ఏరియా అభివృద్ధికి ప్రణాళికలు
- రోడ్ల విస్తరణలో 72 సింగరేణి క్వార్టర్ల తొలగింపునకు నిర్ణయం

కోల్‌సిటీ, మార్చి 17: రామగుండంలో ఉపాధి కరువై యువత వలసలు పోతోంది. సరైన సౌకర్యాలు లేక వ్యాపారాలు ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో రామగుండానికి పూర్వ వైభవం తీసుకురావడం ద్వారా ఈ ప్రాంతంలో వ్యాపారాలను మరింత పెంపొందింపజేసి యువతకు ఉపాధి కల్పించాలని ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ప్రభుత్వం నుంచి నిధుల మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా మొదటి ప్రాధాన్యతగా గోదావరిఖని పట్టణంలోని లక్ష్మీనగర్, ఉల్లిగడ్డలబజార్ ఏరియా, మేదరిబస్తి, ఓల్డ్‌అశోక టాకీస్ ఏరియాల్లో వ్యాపారాలను పెంపొందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతోపాటు సింగరేణి పరిధిలోని ఖాళీ స్థలాలను వ్యాపారాలకు అనుగుణంగా మార్చడం ద్వారా పెద్దపెద్ద వ్యాపారాలు ఇక్కడికి వచ్చేలా చేసి ఈ ప్రాంతంలో యువతకు ఉపాధి కల్పించాలని ప్రణాళికలు చేస్తున్నారు. దీనికిగాను వ్యాపార కేంద్రాల అభివృద్ధికి రూ.50 కోట్లు కేటాయించారు. మౌలిక సదుపాయాలు కల్పన ద్వారానే వ్యాపార కేంద్రాల అభివృద్ధి జరుగుతుందని భావిస్తున్న పాలకవర్గం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా గోదావరిఖని మెయిన్ చౌరస్తా నుంచి వ్యాపార కేంద్రాలకు వెళ్లే రహదారులను పూర్తిస్థాయిలో విస్తరించి అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. మెయిన్ చౌరస్తా నుంచి రీగల్ షూమార్ట్, మేదరిబస్తి, ఓల్డ్ అశోక థియేటర్, గర్ల్స్ హైస్కూల్, మెయిన్ చౌరస్తా నుంచి ఆర్‌సీఓఏ క్లబ్ రహదారులను విస్తరించనున్నారు. ఇందుకోసం 60ఏళ్ల క్రితం నిర్మించిన సింగరేణి క్వార్టర్‌లను కొన్నింటిని తొలగించాలని నిర్ణయించారు. ఇప్ప టికే మున్సిపల్ రికార్డుల ప్రకారం ఇవి కాలంచెల్లిన క్వార్టర్‌లుగా ఉన్నాయి. దీనిలో భాగంగా 72క్వార్టర్లను తొలగించాలని నిర్ణయించారు. సింగరేణి యాజమాన్యం ఈ మేరకు నివాసముంటున్న కార్మిక కుటుం బాలకు నోటీసులు ఇచ్చింది. అభివృద్ధి పనులకు 15 రోజుల్లో క్వార్టర్ ఖాళీ చేయాలని, ప్రత్యామ్నాయంగా మరోచోట క్వార్టర్‌లను కేటాయి స్తామని పేర్కొంది.

● అలాట్‌మెంట్ వస్తే చాలు..

గోదావరిఖని హనుమాన్‌నగర్, శివాజీనగర్ బస్తి, అశోక్‌నగర్ ప్రాంతాల్లో రోడ్డువైపు ఉన్న క్వార్టర్లలో అలాట్మెంట్లకు భారీ డిమాండ్ ఉంది. ఈ క్వార్టర్లు ఆనుకొని షెడ్‌లు నిర్మించారు. వీటిని వ్యాపారులకు అద్దెకిచ్చారు. ప్రధాన రహదారులు కావడంతో ఒకోషెటర్ కు నెలకు రూ.20వేల నుంచి రూ.60వేల వరకు డిమాండ్ ఉంది. సింగరేణి నోటీస్ ఇచ్చిన 72 క్వార్టర్లలో మెజార్టీగా ఈ తరహా నిర్మాణాలు ఉన్నాయి. కొందరు కార్మికులు పదవీ విరమణ చెందిన కూడా క్వార్టర్లను ఖాళీ చేయడం లేదు. కార్మికులకు రావాల్సిన గ్రాట్యూటీని కూడా యజ మాన్యం నిలిపివేసినా క్వార్టర్లు ఖాళీ చేయడం లేదు. అద్దెలు ప్రతినెల వేల రూపాయలు వస్తున్నందుకు రిటైర్డ్ అయినా సంవత్సరాల తరబడి క్వార్టర్‌లలో ఉంటున్నారు.

● సొంతంగా షటర్లు కేటాయించండి..

తాము దశాబ్దలకాలంగా లక్షల రూపాయలు అద్దె చెల్లించి వ్యాపారాలు చేస్తున్నామని, తమకు అద్దెల నుంచి విముక్తి కల్పించాలని, సొంతంగా అడ్డాలు ఇవ్వాలంటూ పలువురు వ్యాపారులు ఎమ్మెల్యే మక్కాన్ రాజ్ ఠాకూర్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను కోరారు. ఈ మేరకు వారు వినతి పత్రాలు ఇచ్చారు.

● వ్యాపారాలు తొలగించకుండా ప్రణాళికలు..

గోదావరిఖనిలో రోడ్ల విస్తరణలో భాగంగా క్వార్టర్లను తొలగించాలని నిర్ణయించగా, దీనిపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా క్వార్టర్ల పక్కన షెటర్లు నిర్మించినవారు, షెటర్‌లలో వ్యాపారాలు చేస్తున్నవారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కొందరు వ్యాపారులు పునరవాసంగా మరోచోట నిర్మాణాలు జరుపుకునే అవకాశం ఇవ్వాలంటూ విజ్ఞప్తులు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో విస్తరణలో వ్యాపార కేంద్రాలలో వ్యాపారాలకు నష్టం కాకుండా రహదారుల నిర్మాణం పూర్తయ్యే వరకు సాధ్యమైనంత వరకు వ్యాపార షెటర్లను తొలగించరాదని నిర్ణయించారు.

● రూ.50కోట్లు నిధులు వ్యాపార కేంద్రాలకు..

రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో గోదావరిఖని వ్యాపార కేంద్రాల్లో అభివృద్ధి పనులకు రూ.50కోట్లు నిధులు కేటాయించారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ద్వారా వంద కోట్ల నిధులు విడుదల చేయించగా ఇందులో రూ.50కోట్లు ఈ ప్రాంతాలకు కేటాయించారు. రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్‌గ్రౌండ్ విద్యుత్తు లైన్లు, స్ట్రీట్ లైటింగ్ కోసం ఈ నిధులను వెచ్చించనున్నారు.

● పండ్ల మార్కెట్ అభివృద్ధికి నాలుగు కోట్లు..

రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో హోల్ సేల్ కూరగాయల మార్కెట్ నిర్మాణాలకు నాలుగు కోట్లు కేటాయించాలని కోరారు. బస్టాండ్ సమీపంలో నాలుగు కోట్లతో పండ్ల మార్కెట్ అభివృద్ధికి నిధులు కేటాయించారు. ప్రస్తుతం గోదావరిఖని చౌరస్తా నుండి రాజేష్ థియేటర్ మధ్యలో సింగరేణి క్వార్టర్‌లను పక్కన హోల్ సేల్ వ్యాపారులు వ్యాపారాలు చేసుకుంటున్నారు. పూర్తిస్థాయిలో పండ్ల మార్కెట్ అభివృద్ధి చేయడం ద్వారా ఈ ప్రాంతంలో హోల్ సేల్ వ్యాపారాలు అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ధర్మారంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న ఇన్విజిలేటర్లు

ధర్మారం, మార్చి 17: పదోతరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు అన్ని పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తిచేశారు. మండలంలో ఐదు పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటుచేయగా, 735మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ధర్మారం జడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో 190, ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రంలో 180, నందిమేడారం జడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో 154, దొంగ తుర్తి జడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో 90, మల్లాపూర్ గురుకుల బాలికల విద్యాలయం పరీక్ష కేంద్రంలో 121మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఒక్కో పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండ్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లతో పాటు 42మంది ఇన్విజిలేటర్‌లను నియమించారు. విద్యార్థులు పరీక్షలు రాసే గదుల్లో హాల్‌టికెట్‌ల నంబర్లను వేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి పరీక్ష కేంద్రం వద్ద తాగునీటి, వైద్య సౌకర్యంను కల్పించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మంథని : పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 10వ తరగతి పరీక్షల కోసం పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాల, సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాల, ప్రభుత్వ హైస్కూళ్లను అధికారులు సెంటర్లుగా ఏర్పాటు చేశారు. మంథని పట్టణంతో పాటు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 516 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలను రాయనున్నారు. ఇందులో జడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో 179, సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాలలో 220, ప్రభుత్వ హైస్కూల్‌లో 117మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఆయా సెంటర్లలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

కోల్‌సిటీటౌన్ : పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి రామగుండం మండలంలో 15 పరీక్షా కేంద్రాలలో 2900 మంది విద్యార్థులు పరీక్ష హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అసౌకర్యలు కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల విషయంలో హాల్ టికెట్లు ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని, హాల్‌టికెట్లు విషయంలో మీసేవ, ఆన్‌లైన్ సెంటర్లలో తీసుకుని వచ్చినా పరీక్షా కేంద్రాలకు అనుమతి ఉంటుందని, కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అధికారులు తెలిపారు.

ఎలిగేడు : ఈనెల 18నుంచి ఏప్రిల్ 2వరకు జరిగే పదో తరగతి పరీక్షలకు తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి కవిత తెలిపారు. ధూళికట్ట హైస్కూల్ 32మంది, సుల్తాన్‌పూర్‌లో 22మంది, ఎలిగేడులో 24మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు.

దుబ్బపల్లి వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు



దుబ్బపల్లి పోలీస్ చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

సుల్తానాబాద్, మార్చి 17 : మండలంలోని దుబ్బపల్లి వద్ద శనివారం ఎన్నికల చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. పోలీసులు రెవెన్యూ తదితర అధికారులతో కూడిన బృందం ఈ చెక్‌పోస్టులో ఎన్నికలు ముగిసే వరకు విధులు నిర్వహిస్తారని సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నిబంధనలను పకడ్బందీగా అమలుచేయడానికి ఈ చెక్‌పోస్టు ఏర్పాటు చేశామని వాహనాల తనిఖీ కొనసాగుతుందన్నారు. శనివారం నుంచి వాహనాల తనిఖీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రావణ్ కుమార్, ఏఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు, గోడ రాతల తొలగింపు



గోడ రాతలను చెరిపివేస్తున్న సిబ్బంది

పెద్దపల్లి రూరల్, మార్చి 17 : కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికలు కోడ్ అమల్లోకి రావడంతో పెద్దపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో సుదర్శన్ ఆదేశాల మేరకు సిబ్బంది, పోస్టర్లకు తొలగింపు, గోడలపై రాసిన రాజకీయ నాయకుల పేర్లు చేరిపి వేశారు.

రాజకీయ పార్టీల బ్యానర్లు, పోస్టర్ల తొలగింపు

మంథని, మార్చి 17: లోక్‌సభ ఎన్నికల కోడ్‌ను అధికారులు అమలు చేస్తున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతోపాటు ఎన్నికల కోడ్‌ను సైతం అమలుచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. జూన్16వ తేదీ వరకు కొనసాగే ఎన్నికల కోడ్ అమలుపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు అన్ని చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మంథని మున్సిపాలిటీలో కమిషనర్ గుట్టల మల్లిఖార్జునస్వామి, ఆయాగ్రామాల్లోని ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు, బ్యానర్స్ హోర్డింగ్స్, వాల్‌రైటింగ్స్, వాల్‌పోస్టర్స్‌ను సిబ్బందితో తొలగింపచేయించారు. అదేవిధంగా మంథని పట్టణంతో పాటు ఆయా గ్రామాల్లో ఉన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు విగ్రహాలను సైతం తెల్లగుడ్డలతో కనబడకుండా ముసుగులు వేశారు.

బీఆర్ఎస్ గెలుపునకు సమష్టిగా పోరాడుదాం

- పెద్దపల్లి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



ముత్తారంలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

కమాన్‌పూర్, మంథని, ముత్తారం, రామగిరి, మార్చి 17 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పోరాడి విజయం సాధించేలా ముందుకు సాగుదామని పెద్దపల్లి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఆదివారం మంథని నియోజకవర్గ పరిధిలోని కమాన్‌పూర్, మంథని, ముత్తారం, రామగిరి మండలాల నాయకులతో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆచరణకు సాధ్యం కాని హామీలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. వందరోజులు గడిచిన ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం సస్యశామలంగా ఉండేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కరువు, కాటకాలతో దర్శనమిస్తుందని అన్నారు. బీఆర్ఎస్ గెలుపుతో కాంగ్రెస్ పార్టీలో ఉణుకు పుట్టాలన్నారు.అనంతరం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ పుట్ట మధుకర్ మాట్లాడుతూ ఢిల్లీ నుంచి ఢిల్లీ దాకా అబద్దాలతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందన్నారు. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ గెలుపుతో బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు బొమ్మగాని అనిల్‌గౌడ్, ఎంపీపీ జక్కుల ముత్తయ్య, సింగిల్ విండో మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పోతుపెద్ది కిషన్‌రెడ్డి, మండల రైతుబంధు కన్వీనర్ అత్తె చంద్రమౌళి, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నూనేకుమార్ పోతుపెద్ది రమణరెడ్డి, మహిళా అధ్యక్షురాలు పప్పు స్వరుప, రామగిరి జడ్పీటీసీ శారద కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు శంకేసి రవీందర్, ఇనగంటి రామారావు, కోలేటి చంద్రశేఖర్, నీలం సరిత, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలేవి?

- రాజీవ్ రహదారి డివైడర్ మధ్య ఎండిపోతున్న మొక్కలు - రాత్రివేళల్లో ఇబ్బందులు పడుతున్నడ్రైవర్లు
- తరచూ సంభవిస్తున్న ప్రమాదాలు.. - పట్టించుకోని అధికారులు



రాజీవ్ రహదారి మధ్యలో ఎండిపోయిన మొక్కలు



మూలమలుపు వద్ద బోల్తాపడిన లారీ(ఫైల్)

సుల్తానాబాద్, మార్చి 17: రాజీవ్ రహదారిపై డివైడర్ల మధ్య మొక్కలు ఎండిపోయాయి. రాజీవ్ రహదారి నిర్వహణ లోపంతో వాహనచోదకులకు తిప్పలు తప్పడం లేదు. మొక్కలు ఎండిపోకుండా సంరక్షణ చర్యలు చేపట్టడమో లేదా ఎండిపోతున్న మొక్కల స్థానంలో ఎప్పటికప్పుడు కొత్తవి నాటడమే చేయాల్సిన అధికారులు వాటి గురించి పట్టించుకోవడం లేదు. అలాగే రోడ్డుకు ఇరువైపులా ఇసుక లారీల రాకపోకల మూలంగా ఇసుక కూలి కూడా అనేక ప్రమాదాలకు కారణమవుతున్నా పట్టించుకోవడం లేదు. మండలంలోని దుబ్బపల్లి గ్రామంనుంచి రాజీవ్‌రహదారి చిన్నకలువల హన్సీ నిమియా వాగు బ్రిడ్జి వరకూ ఉంటుంది. చాలా చోట్ల డివైడర్ల మధ్య మొక్కలు కనిపించడంలేదు. మరికొన్ని చోట్ల మొక్కలు ఉన్నా అవి పూర్తిగా ఎండిపోయి ఉన్నాయి. డివైడర్ల మధ్య చాలా గ్యాప్ వచ్చింది. ఇలా ఉండడం వలను వాహనాల రాకపోకలు సజావుగా సాగడంలేదు. ముఖ్యంగా రాత్రివేళల్లో వాహనాల హెడ్‌లైట్లు ఎదురుగా ఉన్న వాహనాల వారికి ఇబ్బందిగా మారుతున్నాయి. ఒకవైపు వెళ్లే వాహనాలకు మరోవైపు నుంచి వచ్చే వాహనాల లైట్ల వెలుతురు ప్రభావం డ్రైవర్లపై పడకుండా ఉండడానికే డివైడర్ల మధ్య మొక్కలు పెంచుతారు. కానీ ఈప్రాంతంలో మొక్కలు లేకపోవడంతో వాహనాల వెలుతురు డ్రైవర్లకు ఇబ్బందిగా మారింది. దాంతో ప్రమాదాలు చోటుచేసుకోవడానికి అవకాశం ఉంది. రాజీవ్ రహదారి డివైడర్ల మధ్య మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతలను ఈ ప్రాంతంలోని పలు పరిశ్రమల యాజమాన్యాలకు దుబ్బపల్లి నుంచి పెద్దకల్వల వరకు ఒకరికి, అక్కడినుంచి మరొకరికి కొన్ని కిలోమీటర్ల వరకు బాధ్యతలను అప్పగించారు. అప్పటినుంచి రాజీవ్ రహదారిపై ఉన్న మొక్కలను సంరక్షించడం వారే చూస్తున్నారు. మొక్కల సంరక్షణ నిర్వహణ వ్యయం కూడా అవే భరిస్తాయి. దానికి తోడు ఆయా మున్సిపాలిటీల బాధ్యత కూడా ఉంది. ఇప్పటికైనా డివైడర్ల మధ్య మొక్కలు లేని చోట మొక్కలు నాటాలని, మొక్కల సంరక్షణ, నిర్వహణ బాధ్యతలను సక్రమంగా జరిగేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

● ప్రమాదాలకు నిలయంగా మూలమలుపులు..

రాజీవ్ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. సుల్తానాబాద్ పట్టణంలోని రాజీవ్‌రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలామంది ప్రాణాలు కోల్పోతుండగా, ఎందరో గాయాల పాలవుతున్నారు. ముఖ్యంగా సుల్తానాబాద్ పట్టణంలోని ఐబీ చౌరస్తా దాటిన తర్వాత వచ్చే మూల మలుపు వద్ద లారీలు తరచూ బోల్తాపడుతున్నాయి. ఇలా అనేక సంఘటనలు జరిగాయి. కానీ ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. శాస్త్రినగర్ నుంచి తెలంగాణ చౌక్ ఔబీ చౌరస్తా వరకూ కిలోమీటర్‌కు పైగా నేరుగా రోడ్డు ఉండి వాహనాలు వేగంగా వస్తుంటాయి. అదే సందర్భంలో మూలమలపు వద్దకు చేరుకునే సందర్భంలో వాహనాల వేగాన్ని అదుపు చేయలేక బోల్తా పడుతున్నాయి. అటువైపు నుంచి వచ్చే వాహనాలను అదుపు చేయలేక డివైడర్లను ఢీకొని మరో లైన్‌లోకి వచ్చి బోల్తా పడుతున్నాయి. అలాగే స్వప్నకాలనీ యూటర్న్ వద్ద, పూసాల చౌరస్తా వద్ద, ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా సమీపంలో, చెరువు వద్ద గల యూటర్న్ వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇక గ్రామాల విషయానికి వస్తే దుబ్బపల్లి, భూపతిపూర్, గర్రెపల్లి, నర్సయ్యపల్లి, కాట్నపల్లి, రైస్‌మిల్లుల యూటర్న్ వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముర్మూర్‌లో ప్రారంభమైన కొమురన్న జాతర



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న భక్తులు

అంతర్గాం, మార్చి 17: మండల పరిధిలోని ముర్మూర్ గ్రామశివారులో ఆదివారం కొమురన్న జాతర ప్రారంభం అయ్యింది. జాతర మొదటి రోజు మేడలాదేవికేతమ్మ సహిత శ్రీమల్లికార్జున స్వామివారి కల్యాణం నిర్వహించి దృష్టికుంభం, ఫైలలు తీయడం, రుద్రాభిషేకం, సుంకు బియ్యం, పెద్దపట్నం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరకు పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చి భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. జాతర రెండవ రోజు సోమవారం భక్తుల అగ్నిండం ప్రవేశం, ఒగ్గుకథ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జాతర కమిటీ చైర్మన్ గోపు ఐలయ్యయాదవ్ ఆధ్వర్యంలో భక్తులకు తాగునీటి వసతి, చలువ పందిళ్ల ఏర్పాటుతో పాటు అన్నదానం నిర్వహించారు.

పరీక్ష సరిగా రాయలేదని యువతి ఆత్మహత్య

జగిత్యాల రూరల్, మార్చి 17: మండలంలోని అంతర్గాం గ్రామానికి చెందిన నాగులపల్లి అశ్విత (20) అనే యువతి బీటెక్ రెండో సంవత్సరం సెమిస్టర్ పరీక్ష సరిగా రాయలేదని మనస్తాపానికి గురై ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. జగిత్యాల రూరల్ ఎస్ఐ సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న అశ్విత ఇటీవల రెండో సెమిస్టర్ పరీక్షలకు హాజరైంది. అనంతరం శివరాత్రి సెలవుల కోసం అంతర్గాం గ్రామానికి వచ్చింది. పరీక్షలు సరిగా రాయలేదని పలు సందర్భాల్లో కుటుంబసభ్యుల వద్ద బాధపడింది. ఈ నేపథ్యంలో ఐదు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అశ్విత ఆదివారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వడగళ్ల వానకు నేలరాలిన మామిడి




గంభీరావుపేటలో రాలిని మామిడి కాయలు, దారిలో విరిగి పడిన చెట్టు

గంభీరావుపేట, మార్చి 17: గంభీరావుపేట మండలంలో కురిసిన వడగళ్ల వానకు వరి పంటతో పాటు మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురు గాలులతో కూడిని వడగళ్ల వర్షంతో చేతుకు వచ్చిన వరి పంటలు దెబ్బతిన్నాయి. మరో 15 రోజుల్లో వరి కోతలు మొదలయ్యే పరిస్థితిలో ఊహించని నష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలులకు మామిడి కాయలు రాలిపోయాయి. రహదారుల వెంట చెట్లు నెలకొరిగాయి.

● వరిపంటకు నష్టం..

కోనరావుపట: కోనరావుపేట మండలం మరిమడ్లలో శనవారం రాత్రి కురిసన వడగండ్ల వానతో వరిపంట దెబ్బతిన్నాయి. వరిపంటలు పోట్టకు వచ్చిన దశలో వడగండ్ల వాన వల్ల వరిపంటలు దెబ్బతినడం వల్ల రైతులు నష్టపోయో పరిస్థితి ఎర్పడింది. సుమారు మరిమడ్లలో పది ఎకరాల వరకు వరి పంటలు దెబ్బతిన్నాయి.



మరిమడ్లలో నేలవాలిన వడ్లు

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడి మృతి

కోరుట్ల రూరల్, మార్చి 17: మండలంలోని సంగెం గ్రామ శివారులోని వాగులో చేపలు పడుతుండగా యువకుడు మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులో వాగులో యువకులు చేపల వేట చేస్తుంటారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం సమయంలో గ్రామానికి చెందిన కొందరు యువకులు చేపల వేట కోసం వెళ్లారు. చేపలను విద్యుత్ షాక్ సహాయంతో పడుతుంటారు. ఈక్రమంలో పట్టుకున్న చేపలను తేవడానికి నీటిలోకి వెళ్లిన రాయుడి(35) విద్యుదాఘాదానికి గురై మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు రాయుడు బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో మునిగి మత్స్యకారుడు..

మెట్‌పల్లి, మార్చి, 17: పట్టణానికి చెందిన దీటి శంకర్(48) అను మత్స్యకారుడు ఆదివారం చెరువులో చేపలు పట్టుతుండగా ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని నీటిలో మునిగి మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పోలీసలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివారల ప్రకారం.. పట్టణానికి చెందిన శంకర్ చేపలను పట్టుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆదివారం మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన రేగుంట గ్రామ శివారులోని చెరువులో చేపలు పట్టడానికి తోటి మత్స్యకారులతో కలిసి వెళ్లాడు. ఈ క్రమంలో చేపలు పట్టడానికి వేసిన వల కాలుకు చుట్టుకొని చెరువులో మునిగిపోయాడు. గమనించిన తోటి మత్స్యకారులు శంకర్‌ను బయటకు తీసేసరికి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో గాయపడిన వృద్ధురాలి మృతి

మెట్‌పల్లి, మార్చి 17: మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన ఆరుపేట గ్రామ బస్టాండ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధినేని భూమక్క(60) అనే వృద్ధురాలు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. ఆరపేటకు చెందిన బాధినేతి భూమక్క, కోరుట్ల మండలం మోహన్‌రావుపేట గ్రామానికి చెందిన నల్ల లక్ష్మి, శనిగారపు తుక్కవ్వ ఆరపేట బస్టాండ్ బస్సు దిగారు. ముగ్గురు మహిళలు ఇంటికి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా ఏపీ01ఎస్4455 నంబర్ గల కారులో భీమవరం మండలం రాగోజీపేటకు చెందిన సురేష్ అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో ముగ్గురు మహిళలు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను స్థానికులు ప్రత్యేక వాహనంలో మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న బాధినేని భూమక్క ఆదివారం ఉదయం మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయే..

- ధర్మపురిలో 20 నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహణ

ధర్మపురి, మార్చి 17: ధర్మపురిలో మార్చి 20 నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పవిత్ర గోదావరి నదీ తీరాన విరాజిల్లుతున్న ధర్మపురి క్షేత్రానికి పురాణ, ఇతిహాస, సాహిత్యపర ప్రాధాన్యం కలిగి ఆధ్యాత్మిక క్షేత్రంగా విలసిల్లుతోంది. పూర్వం ధర్మవర్మ అనే మహారాజు పరిపాలించుట వలన ఈ క్షేత్రానికి ధర్మపురి అనే పేరు వచ్చింది. క్షేత్రంలో ప్రధానంగా లక్ష్మీనృసింహస్వామి, రామలింగేశ్వరస్వామి ఆలయాలు, మసీదులు పక్కపక్కనే కలిగి అనాది నుంచి వైష్ణవ, శైవ, ముస్లిం మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఈ క్షేత్రంలో బ్రహ్మదేవుడు, విష్ణుస్వరూపుడు అయిన నరసింహస్వామి, రామలింగేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు ముగ్గురు కొలువు అయిన ఈ క్షేత్రాన్ని త్రిమూర్తి క్షేత్రమని కూడా పిలుస్తారు. ఈ ఆలయ ప్రాంగణంలో యమధర్మ రాజు ఆలయం ఉంది. గోదావరి నదిలో స్నానం చేసిన అనతరం స్వామివారలను దర్శనం చేసుకోవటం ఇక్కడ ఆనవాయితీ. స్వామి వారలను దర్శించుకుం టే మానసిక, శారీరక, రుణ బాధలు తొలగి, ఆయురారోగ్య, అష్టఐశ్వర్యాలు ప్రసాదించుతారని భక్తులకు అపార నమ్మకం ఉంది. మార్చి 20 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగే లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి భక్తులు చేరుకుని స్వామివారలను దర్శనం చేసుకుంటారు.

● బ్రహ్మోత్సవాల్లో కార్యక్రమాలు..

ధర్మపురి క్షేత్రంలో మార్చి 20 నుంచి ఏప్రిల్ 1 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ ఈవో, సహాయ కమిషనర్ సంకటాల శ్రీనివాస్ తెలిపారు. మార్చి 20న బుధవారం ఏకాదశి రోజున యజ్ఞాచార్యుల ఆహ్వానం, కళశ, విశ్వక్‌సేన, వాసుదేవ, పుణ్యాహవచనం, బ్రహ్మ కలశ స్థాపన, అంకురార్పణ, వరహాతీర్థం, పుట్ట బంగారం తేవడం, 21న సాయంత్రం ఆరు గంటలకు స్వామివారల కల్యాణం, 22న రాత్రి లక్ష్మీనరసింహ స్వామి వారల ఊరేగింపు సేవ ఉంటుంది. మార్చి 23న రాత్రి వేంకటేశ్వర స్వామి వారల ఊరేగింపు సేవ, 24న బ్రహ్మ పుష్కరిణిలో యోగ నృసింహస్వామి తెప్ప, డోలోత్సవాలు, 25న బ్రహ్మ పుష్కరిణిలో ఉగ్ర లక్ష్మీ నృసింహ స్వామి తెప్ప, డోలోత్సవాలు ఉంటాయి. 26న బ్రహ్మపుష్కరిణిలో వేంకటేశ్వరస్వామి తెప్ప, డోలోత్సవాలు, సాయంత్ర లక్ష్మీనృసింహస్వామి దక్షిణ దిగ్యాత్ర ఉంటుంది. మార్చి 27న లక్ష్మీ నృసింహ స్వామి ఉత్తర దిగ్యాత్ర, రాత్రి ఎనిమిది గంటలకు భోగ మండప ఉత్సవం, తొమ్మిది గంటలకు వేద సదస్సు ఉంటుంది. మార్చి 28న వేంకటేశ్వర స్వామి, దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు, రాత్రి ఎనిమిది గంటలకు దీపోత్సవం, 29న పూర్ణాహుతి, రథోత్సవం, చక్రతీర్థం, రాత్రి తొమ్మిది గంటలకు లక్ష్మీనృసింహ స్వామి వారల పుష్పయాగం ఉంటుంది. 30న రాత్రి ఏడు గంటలకు వేంకటేశ్వర స్వామి పుష్పయాగం, రాత్రి తొమ్మిది గంటలకు యోగ లక్ష్మీనర్సింహస్వామి ఏకాంతోత్సం, 31న రాత్రి ఏడు గంటలకు కొత్త నరసింహస్వామి పుష్పయాగం, రాత్రి తొమ్మిది గంటలకు వేంకటేశ్వరస్వామి ఏకాంతోత్సవం, ఏప్రిల్ 1న రాత్రి తొమ్మిది గంటలకు కొత్త నారసింహ స్వామి ఏకాంతోత్సవాలు ఉంటాయి.



విద్యుత్ దీపాల అలంకరణలో ఆలయం, క్షేత్రంలోని లక్ష్మీనృసింహ (యోగ) స్వామి వారు

● ఆలయ పక్షాన ఏర్పాట్లు పూర్తి

- ఆలయ ఈవో శ్రీనివాస్



స్వామివారి బ్రహ్మోత్సవాల కోసం ఆలయం పక్షాన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాము. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో క్యూలైన్లు, చలువ పందిళ్లు, మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేశాము. ఆలయాలు, గోపురాలకు సున్నం, రంగులు వేయించి విద్యుత్ దీపాలతో అలంకరించాము. గోదావరి నది, స్నానఘట్టాల వద్ద పందిళ్లు, దుస్తుల మార్పిడి కోసం తాత్కాలిక గదులు ఏర్పాటు చేయించాము.

గల్ఫ్ పంపిస్తానని ఏజెంట్ మోసం

- న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 17: గల్ఫ్ ఏజెంట్ మోసం చేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. తమను మోసం చేసిన ఏజెంటుపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని ఆదివారం విలేకరులను వేడుకున్నారు. బాధితుల కథనం మేరకు.. మండలంలోని సింగారం, బండలింగంపల్లి, గొల్లపల్లి గ్రామాలకు చెందిన యువకులు రషీద్, ముఫీద్, ఆసీఫ్, ఇర్ఫాన్, సయ్యద్ ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో నాలుగు నెలల కిందట ముంబాయిలోని ఏజెంట్ అక్తర్ పరిచయమయ్యాడు. రూ 1.50 లక్షలు చెల్లించాలని పేర్కొన్నాడు. ముందుగా రూ.ఒక్కొక్కరు రూ.80 వేలు ముట్టజెప్పాలని స్పష్టం చేశాడు. దీంతో ఐదుగురు యువకులు అప్పులు చేసి రూ.4లక్షలు అప్పజెప్పారు. పాస్‌పోర్టులు, డబ్బులు తీసుకున్నాడు. రెండు నెలలు గడుస్తున్నా వీసా పంపించకపోవడంతో సెల్‌ఫోనులో సంప్రదించారు. ఏజెంటు స్పందించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. 15 రోజుల కిందట సదరు ఏజెంటు యువకుల పాసుపోర్టులను కొరియర్ ద్వారా పంపడంతో తాము మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బుల విషయంపై అడిగేందుకు సెల్‌ఫోనులో సంప్రదిస్తే స్పందన లేదని వాపోయారు. ముంబాయికి వెళ్లలేక.. ఏం చేయాలో తెలియక యువకులు ఆందోళన చెందుతున్నారు. ఏజెంట్ అక్తర్‌పై పోలీసులు చర్యలు తీసుకోవాలని, న్యాయం చేయాలని బాధిత యువకులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాద మృతుడి గుర్తింపు


నారాయణ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మార్చి 17: ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులో ఈ నెల 16న రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందిన మతిస్థిమితం లేని వ్యక్తి ఎల్లారెడ్డిపేట వాసి మంద నారాయణ(53)గా ఆదివారం పోలీసులు, కుటుంబ సభ్యులు గుర్తించారు. వారి కథనం మేరకు.. గ్రామంలోని నారాయణ గత కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా ఇంటి వద్దనే కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తుండేవాడు. ఈ నెల 16న ఇంటిలో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల గాలించారు. తిమ్మాపూర్ గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గుర్తు తెలియని శవం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రిలో ఉందనే సమాచారంతో అక్కడకు వెళ్లి చూడగా తమ తండ్రి నారాయణ అని గుర్తించారు. తమ తండ్రి మరణానికి కారణమైన వాహనాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాలని మృతుడి కొడుకు శ్రీకాంత్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. మృతుడికి భార్య చంద్రకళ, కూతురు స్వప్న, ఇద్దరు కొడుకు శ్రీకాంత్, ప్రశాంత్‌లు ఉన్నారు. కాగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు, కోడెమొక్కులు చెల్లించుకుంటున్న జడ్జి శ్రీలేఖ

వేములవాడ టౌన్, మార్చి 17 : దక్షిణకాశీ వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు రాజన్న ఆలయానికి తరలివచ్చారు. స్వామి వారి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. రాజన్నను దర్శించుకున్న అనంతరం అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలేత్తకుండా ఉండేందుకు ఆలయాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● రాజన్న సేవలు ప్రముఖులు..

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకులు బొడ్ల శైలజ దర్శించుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించగా సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. సిరిసిల్ల జిల్లా అసిస్టెంట్ సెషన్‌జడ్జి శ్రీలేఖ ఆలయంలో ప్రత్యేకపూజలో పాల్గొని కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సూపరింటెండెంట్ తిరుపతిరావు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

భూ కబ్జా కేసులో మాజీ ఉపసర్పంచ్ అరెస్ట్

సిరిసిల్ల క్రైం, మార్చి 17: భూ కబ్జాకు పాల్పడిన కేసులో తంగళ్లపల్లి మండలకేంద్రం మాజీ ఉపసర్పంచ్ పెద్దూరు తిరుపతిని ఆదివారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్మనగర్‌లోని వేముల కనక నారాయణ, రాజ్యలక్ష్మి, గాజుల లతకు చెందిన సర్వేనెంబర్ 247లోని భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని వారి భూమిని తిరిగి రిజిస్ట్రేషన్ చేయడానికి తిరుపతి భారీగా డబ్బులు డిమాండ్ చేశారని ఆయన తెలిపారు. ఈ మేరకు బాధితులు ఫిర్యాదుచేయగా తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో తిరుపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా అనేక క్రిమినల్, అక్రమ డబ్బు వసూళ్లకు పాల్పడిన కేసుల్లో నిందితు డని తేలిందన్నారు. దీంతో తిరుపతిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపామని ఆయన తెలిపారు. భూ కబ్జాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ డబ్బులు డిమాండ్‌చేసే వారిపై ప్రజలు ధైర్యంగా పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని ఆయన తెలిపారు.

తంగళ్లపల్లి ఎంపీటీసీ అంతయ్య..

భూ అక్రమణ కేసులో జిల్లాలోని తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కోడి అంతయ్యను ఆదివారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తంగళ్లపల్లి మండలంలో మహిళ పేరుతో ఉన్న భూమిని ధరణి సమయంలో తంగళ్లపల్లి ఎంపీటీసీ కోడి అంతయ్య తన పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నాడన్నారు. భూమిని ఖాళీ చేయాలని భూమిలోకి అక్రమంగా ప్రవేశించి కులం పేరుతో దూషించాడని బాధితురాలు గట్టుపల్లి భూమవ్వ తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. ఫిర్యాదు మేరకు అంతయ్యపై బెదిరింపులు, భూ ఆక్రమణ, అట్రాసిటీ కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

● ఆగి ఉన్న లారీ ఢీకొని ముగ్గురు..

● ఆటో ఢీకొని ఒకరి దుర్మరణం

కోరుట్ల రూరల్, మార్చి 17: జగిత్యాల, కరీంనగర్ జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామంలో ఆదివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కూలీలు మృతి చెందారు. కోరుట్ల మండలం వెంటాపూర్ గ్రామ శివారులోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కూలీలు మృతి చెందారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఒంగోలు పట్టణానికి చెందిన బడికెల వేణుగోపాల్ (30) మల్యాల మండ ల ముత్యంపేట గ్రామానికి తన తండ్రితో 25 సంవత్సర క్రితం వచ్చి నివాసం ఉంటున్నాడు. వేణుగోపాల వృతిరిత్యా మేస్త్రీ పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో కొండగట్టు ప్రాంతంలో ఓ వ్యాపారి మెట్‌పల్లి పట్టణంలో తన కూతురు ఇల్లు నిర్మాణం పనులను వేణుగోపాల్‌కు అప్పగించాడు. నిర్మాణ పనులలో భాగంగా వేణుగోపాల్ ఆదివారం ఉదయం కొండగట్టు ప్రాంతానికి చెందిన పసులేటి శ్రీకాంత్ (23), కొమరం వెంకటేష్ (40) అనే కూలీలతో మెట్‌పల్లి పట్టణంలో ఇంటి పనులు చేసేందుకు ఒకే ద్విచక్రవాహనంపై బయల్దేరారు. ఈక్రమంలో మండలంలోని వెంకటాపూర్ గ్రామశివారులో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. ఈ సంఘటనలో పసులేటి శ్రీకాంత్, కొమరం వెంకటేష్ సంఘటన స్థలంలోనే మృతి చెందగా బడికెల వేణుగోపాల్ తీవ్ర గాయాలతో పడిపోయి ఉన్నాడు. గమనించి స్థానికులు విషయాన్ని కోరుట్ల పోలీసులతో పాటు 108 సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది వేణుగోపాల్‌ను చికిత్సనిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కోరుట్ల, మెడిపల్లి ఎస్ఐలు కిరణ్ కుమార్, శ్యాంప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. మృతదేహాలను కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. పసులేటి శ్రీకాంత్‌కు ఇటీవల వివాహం జరుగగా భార్య శిరిషా గర్భవతిగా ఉంది. వేణుగోపాల్‌కు భార్య జ్యోతితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకటేష్‌కు భార్య సాయమ్మ తో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాదానికి గురైన వాహనాన్ని రాజస్థాన్‌కు చెందిన వాహనంగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. సంఘటన స్థలాన్ని కోరుట్ల సీఐ సురేష్‌బాబు పరిశీలించారు.


వేణుగోపాల్(ఫైల్)


శ్రీకాంత్ (ఫైల్)

● ముత్యంపేటలో విషాదం..

మల్యాల: కోరుట్ల మండలం వెంకటాపూర్ వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముత్యంపేట, కొండగట్టుకు చెందిన ముగ్గురు దుర్మరణం చెందడం స్థానికంగా విషాదం నింపింది. ఒంగోలు ప్రాంతానికి చెందిన వేణు ఇళ్ల నిర్మాణ పనులకు గాను కొన్నేళ్ల క్రితం ముత్యంపేటకు వచ్చాడు. ఇళ్ల నిర్మాణాలు చేస్తున్న అతను మెట్‌పల్లిలో జరిగే పనుల కోసం కొండగట్టుకు చెందిన శ్రీకాంత్, వెంకటేష్‌ను తీసుకెళుతుండగా జరిగిన ఈ ఘటనలో ముగ్గురూ మృతి చెందగా వేణు మృతదేహాన్ని తమ స్వగ్రామం ఒంగోలుకు తరలించారు. వేణుకు భార్య, ఐదేళ్లలోపు ఇద్దరు కొడుకులు ఉన్నారు. శ్రీకాంత్ మృతదేహానికి కుటుంబసభ్యులు కొండగట్టులో అంత్యక్రియలు నిర్వహించారు.

● కరీంనగర్ జిల్లాలో..

కరీంనగర్ క్రైం: కొత్తపల్లి మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొక్కెరకుంటకు చెందిన బత్తిని లక్ష్మిరాజం(60) తీవ్రగాయాలతో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

లక్ష్మిరాజం ఉదయం పనిఉందని కొత్తపల్లికి వెళ్ళిన సమయంలో రోడ్డు పక్కన నడుస్తుండగా వెనుకవైపు నుంచి అతివేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టి కొంతదూరం వరకు లాక్కెల్లిన ఆటో బోల్తాపడిందని తెలిపారు. దీంతో లక్ష్మిరాజంతోపాటు ఆటోలో ఉన్న నలుగురు వ్యక్తులకు గాయాలుకాగా అందరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో లక్ష్మిరాజం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఆటోడ్రైవర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

వేర్వేరు చోట్ల పిడుగుపాటుకు మూడు గేదెల మృతి


వల్బాపూర్‌లో మృతి చెందిన గేదె

వీణవంక, మార్చి 17: మండలంలోని వల్బాపూర్ గ్రామంలో అదివారం సాయత్రం పిడుగు పడడంతో గేదే మృతి చెందింది. గ్రామంలోని తాళ్లపల్లి శ్రీనివాస్‌కు చెందిన గేదేను ఇంటి ఆవరణలో చెట్టు కింద మేత మేస్తుండగా పిడుగు పాటుతో మృతి చెందినట్లు తెలిపారు. దాదపు యాభై వేల విలువచేసే గేదే మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు.

గన్నేరువరం: మండలంలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగుపడి మండల కేంద్రానికి చెందిన రైతు బుర్ర రామచంద్రం పాడి గేదె మృతి చెందింది. గేదె మృతితో సుమారు రూ.60 వేల నష్టవ వాటిల్లిందని, దీంతో జీవనోపాధి కోల్పోయానని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

కాల్వ శ్రీరాంపూర్: పిడుగుపాటుతో పాడి గేదె మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పెరుగు ఐలు కొమురయ్యకు చెందిన పాడి గేదెను ఇంటి సమీపంలోని ఓ చెట్టు కట్టేశాడు. అకాల వర్షంతోపాటు చెట్టుపై పిడుగుపడి గేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గేదె విలువ రూ.40వేలు ఉంటుందని బాధితులు వాపోయాడు.

మల్లారెడ్డిపేటలో ఒకరి ఆత్మహత్య

గంభీరావుపేట, మార్చి 17: గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన కండెల దేవయ్య (46) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. కండెల దేవయ్య శనివారం తన ఇంట్లో గడ్డిమందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున దేవయ్య మృతి చెందాడు. సిద్దిపేటలో ఉన్న ప్లాటు రోడ్డు విస్తరణలో పోతుందనే బెంగతో దేవయ్య రోజూ బాధపడేవాడని మృతుడి భార్య మల్లవ్వ పోలీస్‌లకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అయితే ప్లాటు కొనుగోలు సమయంలో చేసిన అప్పుతో పాటు పిల్లల చదువుల కోసం చేసిన అప్పులతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపింది. ప్లాటు కోసం చేసిన అప్పే కట్టని పరిస్థితిలో ఆ ప్లాటే రోడ్డు విస్తరణలో పోతుందనడంతో మానసికంగా కృంగిపోయాడని వెల్లడించింది. అప్పుల ఒత్తిళ్లు, మరో వైపు ప్లాటు బెంగతో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని దేవయ్య భార్య ఫిర్యాదు చేసింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంమోహన్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి


హరీష్ (ఫైల్)

ఇల్లందకుంట, మార్చి 17: మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి కంచం హరీష్ (28) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన నలుగురు ట్రాక్టర్ (మిల్లర్)పై జమ్మికుంటలో ఒకరి ఇంటికి స్లాబ్ పోసి ఆదివారం సాయంత్రం తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో ఇల్లందకుంట ఎస్‌బీఐ సమీపంలో రోడ్డుపై కంకర కుప్ప ఉండడంతో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కంకర కుప్ప ఎక్కడం వల్ల ఇంజన్ బోల్తా పడింది. దీంతో ఇంజన్‌పై కుర్చున్న కంచం హరీష్ ఎగిరిపడి కింద పడడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అరుణ్, సాంబయ్యకు తీవ్రగాయాలు కాగా, రాజయ్యకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. గాయాలైన వారిని జమ్మికుంట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతి చెందిన హరీష్‌కు 9నెలల క్రితమే వివాహం జరిగింది. వీరందరూ ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో కనగర్తి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లి రూరల్ మార్చి 17: మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన పొన్నం శ్రీనివాస్‌గౌడ్ అనే గీత కార్మికుడు తాటి చెట్టు పైనుంచి పడి గాయాల పాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వృత్తి రీత్యా శనివారం సాయంత్రం కల్లు గీసేందుకు వెళ్లగా తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తున్న క్రమంలో మోకు జారి శ్రీనివాస్ కింద పడిపోయాడు. వెంటనే స్థానికులు గుర్తించి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబసభ్యులు, గౌడ సంఘం నేతలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మాజీ తహసీల్దార్ ఇంట్లో సోదాలు


శ్రీనివాస్ ఇంట్లో సోదాలు చేస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, మార్చి 17: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూమిని ఆక్రమించిన కేసులో అరెస్టు అయి జైలులో ఉన్న మాజీ తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌ను కస్టడీకి తీసుకున్న కరీంనగర్ రూరల్ పోలీసులు హైదరాబాద్‌లోని మాధాపూర్‌లో అతని ఇంటిలో ఆదివారం సోదాలు నిర్వహించారు. రెండురోజులు కస్టడీకి తీసుకున్న పోలీసులు మొదటి రోజు శనివారం కరీంనగర్‌లో ఇల్లు, గెస్ట్‌హౌజ్‌లో సోదాలు జరిపిన పోలీసులు పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం మాధాపూర్‌కు తీసుకువెళ్లి అతని అపార్ట్‌మెంట్‌లో సోదాలు నిర్వహించామని, కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

పెగడపల్లి, మార్చి 17: మండలం లోని బతికెపల్లి గ్రామానికి చెందిన వడ్కాపురం భాస్కర్ (35) అనే యువకుడు జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు భాస్కర్ అప్పుల బాధ పెరగడంతో కుటుంబ పోషణ భారం అయింది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంటి పక్కనచ గల బాత్రూంలో ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుని భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ముందస్తు ప్రణాళికతోనే ప్రశాంతంగా ఎన్నికలు

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి - రామగుండం సీపీ శ్రీనివాస్




సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రామగుండం సీపీ శ్రీనివాస్, హాజరైన పోలీస్ అధికారులు

కోల్‌సిటీ, మార్చి 17: ముందస్తు ప్రణాళికతోనే ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కమిషనర్‌లో ఎన్నికల శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికలకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని దానికి అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. అధికారులంతా ఎన్నికల నియమావళికి లోబడి పనిచేయాల్సి ఉంటుందని, ఎన్నికల డ్యూటీ చేస్తున్న అధికారులు మోడల్ కోడ్ అఫ్ కండక్ట్‌లోగల అంశాలపై, ఎన్నికల బందోబస్తు, ఎన్నికల ప్రవర్తన నియమావళి, సిబ్బంది మోహరింపు, కేంద్ర బలగాలతో సమన్వయ తదితర అన్ని అంశాలపై పోలీసు అధికారులకు స్పష్టత ఉండాలని, దానికి అనుగుణంగా పోలీసు అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. రాబోయే ఎన్నికలకు సంబంధించి పోలీస్ అధికారులకు ఎన్నికల నియమావళి పట్ల ఎటువంటి అవగాహనా రాహిత్యం లేకుండా, వారికి గల పలు సందేహాలను నివృత్తి చేసేందుకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఎన్నికల్లో కొత్త సవాళ్లు ఎదురవుతాయని, ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయాలని సీపీ పేర్కొన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, వల్నరబుల్ పోలింగ్ ప్రాంతాలకు గుర్తింపు పట్ల స్పష్టత ఉండాలని, ఎన్నికల నిర్వహణలో పోలీస్ పాత్ర భద్రత దళాల మోహరింపు నామినేషన్ దాఖల నుంచి ప్రచారం పోలింగ్ రోజు నిర్వహణ తదితర అంశాలపై చేపట్టే ప్రణాళికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల వద్ద ఎలా శాంతి భద్రతను పర్యవేక్షించాలి, ఎన్నికల నిర్వహణలో ఎదురయ్యే సవాళ్ల చేపట్టవలసిన ప్రత్యేక చర్యలు, ప్రత్యేక బందోబస్తుపై సూచనలు చేశారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని గత ఎన్నికల్లో అమలు చేసిన గుడ్ ప్రాక్టీస్‌ను అమలు చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు ముందే ఈ విధంగా అయినా ప్రణాళిక సిద్ధం చేసుకోవడం వల్ల ఎన్నికల నిర్వహణ మరింత సులభతరంగా ఉంటుందని అన్నారు. ఎన్నికలను శాంతియుతంగా, నిస్పక్షపాతంగా నిర్వహించేందుకు ఉత్తమ విధానాలు, పారదర్శకత పాటించాల్సిన అవసరాన్ని వివరించారు. గత ఎన్నికల సంబంధిత నేరాల చరిత్ర ఉన్నవారు, రౌడీషీటర్లు, ఎన్నికల్లో శాంతికి విఘాతం కలిగించే వారి జాబితా సిద్ధం చేసుకోవాలని, వారికి కౌన్సిలింగ్ నిర్వహించి వారిని సంబంధిత అధికారుల ముందు బైండోవర్ చేయాలి. ఎన్నికల సమయంలో జైలు నుంచి బయటకు వచ్చిన వారి వివరాలు సేకరించాలన్నారు.. ట్రబుల్ మంగర్స్‌పై నిఘా ఉంచాలని, వారిని పోలీస్ స్టేషన్‌లకు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. సెన్సేషనల్ కేసులలో నిందితులు, కమ్యునల్ ఆఫెండర్స్, గొడవలు సృష్టించే వారిని, లాఅండ్ఆర్డర్ సమస్య కలిగించే వారిని గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. ఎన్‌బీడబ్ల్యూఎస్ మిగిలిన వారిని కూడా గుర్తించి బైండోవర్ చేయాలని ఆదేశించారు. తమ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్నటువంటి ఆయుధ లైసెన్స్ కలిగిన వారి వద్ద నుండి ఆయుధాలను డిపాజిట్ చేపించాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో నగదు, మద్యం అక్రమ రవాణా, అనుమానిత వాహనాల తనిఖీ, పోలింగ్ స్టేషన్ల నిర్వహణ తదితర భద్రతా సంబంధిత అంశాలను సీపీ శ్రీనివాస్ వివరించారు.

రామగుండం కమిషనర్ పరిధిలో ఆదివారం నుంచి వారం రోజులపాటు పోలీస్ అధికారులకు తరువాత, ఏఎస్ఐ, హెచ్‌సీ, పీసీలకు ఎన్నికల సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో రెండు జిల్లాలకు సంబంధించిన ఏసీపీలు, సీఐలు, ఎలక్షన్ సెల్ సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

హేమోఫిలియా వ్యాధిపై అవగాహన

మంథని, మార్చి 17: పెద్దపల్లి హేమోఫిలియా చాప్టర్ తరఫున హేమోఫిలియా వ్యాధిపై అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. 40 మందికి వంశ పారంప ర్యంగా వస్తున్న దీనిని ఎలా ఎదుర్కోవాలో, కరీంనగర్ ఆసుపత్రిలో అందజేస్తున్న చికిత్స, ఫిజియోథెరపీ ప్రాముఖ్యతని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బండి సుమన్, డాక్టర్ నవీన, డాక్టర్ ఉదయ్, పెద్దపల్లి చాప్టర్ అధ్యక్షుడు మురళీ కృష్ణ వొజ్జల, సెక్రెటరీ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ హరీష్ పాల్గొన్నారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

సుల్తానాబాద్, మార్చి 17: సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ దర్మకర్తల మండలి చైర్మన్ పల్లా మురళి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి అధ్య యానోత్సవ పరమ పదోత్సవ సహిత బ్రహ్మోత్సవాలకు స్వామివారి కల్యాణోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 22న ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన ఆర్యవైశ్యులు

ఎలిగేడు, మార్చి 17 : ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు ఎమ్మెల్యే విజయరమణరావుకు శివపల్లిలో ఆదివారం మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు కృజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్ష,కార్యదర్శులు ఎల్లంకి రాజేశం, తాటిపల్లి మల్లేశం, మల్యాల రమణయ్య, తాటిపల్లి రమేష్‌బాబు, పాత మారుతి, కేశెట్టి విద్యాసాగర్, కోశాధికారి కేశెట్టి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

చెరువు శిఖం భూముల్లో అక్రమ నిర్మాణాలు



శిఖం భూమిలో నిర్మాణాల కోసం చదును..

సుల్తానాబాద్, మార్చి 17: సుల్తానాబాద్ పెద్దచెరువు శిఖం భూములు అక్రమణలకు గురవుతున్నాయి. ఆ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. సుల్తానాబాద్ పెద్దచెరువు పరిధిలో ఆరు వందల ఎకరాల ఆయకట్టు ఉంది. గుడిమిట్టపల్లి నుంచి పూసాల రోడ్డు, బస్టాండ్ వెనుక వరకు, ర్యాకల్దేవ్‌పల్లి శివారు వరకు, కందునూరిపల్లి వరకు విస్తరించి ఉంది. చెరువు శిఖం భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దనే నిబంధనలను ఉన్నా యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. సుల్తానాబద్ చెరువు చుట్టూ పెద్దఎత్తున నిర్మాణాలు చోటుచేసుకున్నాయి. భూముల ధరలు ఆకాశన్నంటడంతో ఎలాంటి భూములకైనా రెక్కలు వచ్చాయి. దాంతో ఈ అవకాశాన్ని అసరాగా చేసుకుంటున్న ధళారులు పైరవీ కారులు శిఖం భూముల్లో పట్టా కలిగి ఉన్న వారిని ప్రలోభపెట్టి అట్టి భూములను ఎలాగైనా విక్రయించేలా చూసి వారిని ప్రలోభపెట్టి అట్టి భూములకు పవర్ అప్ పట్టా లాంటివి చేయించుకుని వాటిని అధిక ధరలకు ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకుని వాటిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలో మున్సిపాలిటీ వారు ఈ విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడం, కొంత మంది ప్రజాప్రతినిధులు ఈ అక్రమ నిర్మాణాలకు అండగా ఉండడంతో ఇక్కడ యథేచ్ఛగా నిర్మాణాలు జరిగాయి. వేసవి కాలం కావడంతో సుల్తానాబాద్ చెరవులో నీరు తగ్గిపోవడంతో శిఖంభూముల్లో ఉన్న తుంగతో కూడిన స్థలాలు వెలుగు చూస్తున్నాయి. వీటిలో నిర్మాణాలు చేపట్టేందుకు శిఖం భూములను జోరుగా చదును చేయిస్తున్నారు. ఇవి పట్టా భూములే అయినా ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని చట్టాలు చెబుతున్నాయి.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ప్రభుత్వ భవనాలు



మండల కేంద్రంలో ఖాళీగా ఉన్న రెవెన్యూ కార్యాలయం పాత భవనం

జూలపల్లి, మార్చి 17 : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల ఆవరణ లోని ఎమ్మార్వో కార్యాలయం పాత భవనాలు, ఇతర ప్రభుత్వ భవనాలు కొంతకాలంగా ఖాళీగా ఉంటున్నాయి. దీంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. చీకటి పడిన తర్వాత ఆయా భవనాల్లో పలువురు యువకులు గంజాయి, మద్యం సేవిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అధ్వానంగా మురుగు కాల్వలు.. పట్టించుకోని అధికారులు



ఖమ్మంపల్లిలో చెత్తాచెదారం పేరుకుపోయిన మురుగుకాల్వ

ముత్తారం మార్చి17: సర్పంచుల పదవీ కాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది. దీంతో గ్రామాల్లో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో మురుగుకాలువలను శుభ్రం చేయకపోవడంతో మురుగునీరంతా నిల్వ ఉండి దోమలు పెరిగి జ్వరాలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అట్రాసిటీ కేసులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

-జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాంచందర్



మాట్లాడుతున్న వడ్డేపల్లి రాంచందర్

కోల్‌సిటీటౌన్/యైటింక్లయిన్‌కాలనీ/పెద్దపల్లిటౌన్ మార్చి17: ఎస్సీ, ఎస్టీల కేసు విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు దేశంలో ఎన్నో అధికారాలు ఉన్నాయన్నారు. పోలీసు అధికారులు కానీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలోని అధికారులు కానీ ప్రమోషన్, పాలసీలు, ఉద్యోగ నియమాలలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని రాంచందర్ పేర్కొన్నారు. ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్, దళిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం రాత్రి గోదావరిఖని ప్రైవేట్ హోటల్‌లో జరిగిన ఆత్మీయ సన్మాన సభలో ఆయన మాట్లాడారు. సింగరేణి, ఎన్టీపీసీ, జెన్‌కో, ఆర్‌ఎఫ్‌సీఎల్ తదితర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు అణగారిన వర్గాలకు ఎస్సీ కమిషన్ అండగా ఉంటుందన్నారు. మైస రాజేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బొంకూరి మధు, కుర్మపల్లి మాజీ సర్పంచ్ బాప్య, నాతరి రాయమల్లు, సదయ్య, కొంకటి లక్ష్మణ్, కాంపెల్లి సతీష్, లంగయ్య, పులిమోహన్, నాగేశ్వరరావు, చంద్రమౌళి, వడ్డేపల్లి శంకర్, రావుల రాజేందర్, అక్కపాక తిరుపతి, రవీందర్, ఇరుకుల్ల రాజనర్సయ్య, శనిగరపు రామస్వామి, కృష్ణయ్య, మహనీయుల ఆశయ సాధన సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి కైలాసం, మాల మహానాడు నాయకులు గాదం శంకరయ్య, పట్టణ అధ్యక్షులు ఖండే కరుణాకర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

పాలకుర్తి, మార్చి 17: మండలం పరిధిలోని జయ్యారం ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహంలో ఉంటూ పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆదివారం వార్డెన్ మెండె సంపత్‌కుమార్, సిబ్బంది పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి మానసిక ఒత్తిడులకు గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. మంచి మార్కులతో పాసై కన్న వారికి, చదువుకున్న పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిబ్బంది తయార్, స్వామి, చంద్రయ్య పాల్గొన్నారు.

సాయిమణికంఠ పాఠశాల వార్షికోత్సవం



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

ధర్మారం, మార్చి17: మండల కేంద్రంలో గల సాయిమణికంఠ పాఠశాలలో ఆదివారం వార్షికోత్సవం నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. నృత్య ప్రదర్శనలు చేసిన విద్యార్థులను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జైన సురేష్‌కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ జైన రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదిగలకు అన్యాయం చేయొద్దు

పెద్దపల్లి టౌన్ మార్చి17: అంబేద్కర్ ఆశయాలను తమ స్వార్థానికి ఉపయోగించుకొని ఎదిగిన వ్యాపారులకు పెద్దపల్లి పార్లమెంటు స్థానాన్ని కేటాయించి మాదిగలకు అన్యాయం చేయవద్దని మాదిగ శక్తి వ్యవస్థాపకులు, తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి సురేందర్ సన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కోరారు. జిల్లా కేంద్రంలోని నందనగార్డెన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సన్ని మాట్లాడారు. వ్యాపారాలు, హోదాల కోసం రిజర్వేషన్లలను వాడుకునే వారిని దూరం పెట్టాలన్నారు. ఉద్యమ నేపథ్యం కలిగిన ప్రజా సంఘాల జేఏసీ నాయకుడు గజ్జెల కాంతానికే పెద్దపల్లి పార్లమెంటు సీటుని ఖరారు చేయాలన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఇతర మంత్రులకు విన్నవించినట్లు తెలిపారు. త్వరలో ఏఐసీసీ కార్యాలయం ముందు మాదిగ డప్పులతో ప్రదర్శన చేపట్టనున్నట్లు వివరించారు. సమావేశంలో జేఏసీ జిల్లా అధ్యక్షులు పొన్నం సత్తయ్యగౌడ్, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుక్క చంద్రమౌళి, శక్తి జిల్లా కన్వీనర్ కళ్యేపల్లి రవిమాదిగ తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం

కమాన్‌పూర్, మార్చి 17: మండల కేంద్రంలో రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవ వేడుకలు ఈనెల 28 నుంచి ప్రారంభం కానున్నాయని, ఈ ఉత్సవ వేడుకలకు గౌడ సామాజిక వర్గంతో పాటు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హజ్రై విజయవంతం చేయాలని కమాన్‌పూర్ గౌడ సంఘం నాయకులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని పిల్లిపల్లె గ్రామంలో రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ కల్యాణ ఉత్సవ వేడుకలు ఈ నెల 28 నుంచి ప్రారంభమై ఏప్రిల్ 2వ తేదీ వరకు కొనసాగుతాయని, ఈ వేడుకలకు అన్ని వర్గాల ప్రజలతో పాటు, ప్రజాప్రతినిధులు హజరు కావాలని కోరారు.

టెండర్ల ఆహ్వానం

కమాన్‌పూర్, మార్చి 17: మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి ఆలయంలో కిరాణ సామగ్రిని సంవత్సర కాల పరిధి నిమిత్తం సరఫరా చేయుటకు అర్హులైన, ఆసక్తిగల వ్యక్తుల నుంచి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ అధికారి కాంతారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 20న టెండర్‌లను ఓపెన్ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు ఈ నెల 18 నుంచి 20వ తేదీ లోపు టెండర్లను సమర్పించాలని కోరారు.

● 20న హుండీ లెక్కింపు

ఈనెల 20న ఆదివరాహస్వామి ఆలయ హుండీ లెక్కింపు జరగనున్నట్లు ఆలయ అధికారి కాంతారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల ప్రజలు హుండీ లెక్కింపులో పాల్గొనవచ్చని తెలిపారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం ముగింపు



వలంటీర్లకు బహుమతులు అందజేస్తున్న ఏఎస్సై

పెద్దపల్లి రూరల్, మార్చి 17: మండలంలోని మారేడుగొండలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం 50మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో ముగిసింది. ముఖ్య అతిథిగా ఏఎస్సై డి.రవీందర్రావు, కొండ రవి యాదవ్(ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత) పాల్గొన్నారు. ఈసందర్భంగా గాయత్రి విద్యాసంస్థల అధినేత అల్లంకి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు ద్వారా విద్యార్థులకు సమాజంలో నాయకత్వ లక్షణాలు అలవర్చుకుంటారని అన్నారు. యువత సోషల్ మీడియా ద్వారా చెడు దారిన పడుతున్నారని మంచి మార్గాన వెళ్లాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రవి యాదవ్, ప్రోగ్రాం ఆఫీసర్ ఎంఏ సమద్, అధ్యాపకురాలు ఆమని పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన

రామగిరి మార్చి 17: మండలంలోని నాగేపల్లి ప్రధాన చౌరస్తాలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు అంబేద్కర్ సంఘం నాయకులు గద్దల శంకర్, కొప్పూరి బాణేష్‌లు తెలిపారు. ఆదివారం నాగేపల్లి చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. అనంతరం మాట్లాడుతూ... 2001లోనే అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు దివంగత అంబేద్కర్ సంఘం నాయకులు బోగే రాజారామ్ ఆధ్వర్యంలో భూమి పూజ జరిపినట్లు తెలిపారు. రోడ్డు వెడల్పు అనంతరం మార్కింగ్ ఇస్తామని ఆర్ అండ్ బీ అధికారులు తెలిపారని, 20 ఏళ్ల తర్వాత విగ్రహ ఏర్పాటుకు మోక్షం లభించనున్నట్లు తెలిపారు. అన్ని పార్టీల నాయకులు రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని, ఆర్థికంగా తోడ్పాటు అందించాలని కోరారు. రోడ్డు నిర్మాణం పూర్తవగానే విగ్రహ ఏర్పాటు పనులు ప్రారంభిస్తామని తెలిపారు. వారి వెంట దళిత సంఘం నాయకులు, నాగేపల్లి తాజా మాజీ సర్పంచ్ కొండవేన ఓదెలు యాదవ్ బడికల శ్రీనివాస్, రేణికుంట్ల కొమురయ్య, కాదాసి రమేష్, బూడిద సమ్మయ్య, రామిండ్ల దుర్గయ్య కన్నూరి కైలాస్, మాతంగి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధిహామీ’ ఉద్యోగులకు అందని వేతనాలు

- నాలుగు నెలలుగా ఇబ్బందులు పడుతున్న వైనం - ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి

పెద్దపల్లి రూరల్, మార్చి 17 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగులకు నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీతం రాక ఇంట్లో గడవక బతుకు భారంగా మారిందని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. అప్పులు చేసి జీవనాన్ని సాగిస్తున్నారు.

● ఉపాధి పనుల్లో కీలకపాత్ర...

జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనుల్లో ఈజీఎస్ ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈజీఎస్ ద్వారా రైతు వేదికల నిర్మాణాలు, రైతు కల్లాలు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠదామాలు, నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్డులు, ఇంకుడుగుంతలు, మరుగుదొడ్ల నిర్మాణం, అవెన్యూ ప్లాంటేషన్, పశువుల షెడ్ల నిర్మాణం, మురుగు కాలువల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం, గ్రామీణ క్రీడా ప్రాంగణాలు, మొక్కల రక్షణ, కాలువలు శుభ్రం చేయడం వంటి పనులతో పాటు పలు రకాల పనులను గ్రామాల్లో చేపడుతున్నారు. ఈ పనులను సజావుగా నిర్వహించడంలో ఈజీఎస్ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. మండలంలోని 30 గ్రామాలకు 30 ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉండాల్సి ఉండగా 22 మంది మాత్రమే ఉన్నారు. వీరితో పాటు ఏపీవో, ఒక జేఈ, టెక్నికల్ అసిస్టెంట్‌లు ముగ్గురు, కంప్యూటర్ ఆపరేటర్‌లు ముగ్గురు విధులు నిర్వహిస్తున్నారు. నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వేతన బకాయిలను వెంటనే చెల్లించి ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు.

● పే స్కేల్ అమలు చేయాలి

- బొంగాని వెంకటేష్ గౌడ్, ఉపాధిహామీ ఉద్యోగుల జేఏజీ చైర్మన్



జాతీయ ఉపాధిహామీ పథకం కింద కూలీలకు పనులు కల్పిస్తూ వస్తులుంటున్న పరిస్థితి ఉంది. నాలుగు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పే స్కేల్ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ఎలాంటి ప్రస్తావన కూడా ఎత్తని పరిస్థితి ఉంది. వెంటనే పేస్కేల్ అమలుచేసి ప్రతి ఉద్యోగికి హెల్త్ కార్డులు అందజేయాలి.

● ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా వేతనాలు చెల్లించాలి

- సది, ముత్తారం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్



రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న మాదిరిగానే ఈజీఎస్ ఉద్యోగులకు ప్రతినెలా 1వ తేదీన వేతనాలు అందించాలి. ఈజీఎస్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతో పాటు, వేతనాలను సక్రమంగా చెల్లించాలి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈజీఎస్ ఉద్యోగులను కూడా ఆదుకోవాల్సిన అవసరం ఉంది. వెంటనే వేతనాలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలి.



కార్మికులకు పని వేళలు మార్చాలి

రామగిరి మార్చి 17: ఆర్జీ-3 ఓసీపీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేసవికాలం సందర్భంగా పనివేళలు మార్చాలని, పని సమాయాల్లో మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని యాక్టింగ్ జీఎం రాధాకృష్ణకు సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

‘కార్మిక సమస్యల పరిష్కారంలో ముందంజ’

శ్రీరాంపూర్, మార్చి 17: కార్మిక సమస్యల పరిష్కారంలో ముందంజలో ఉన్నామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య అన్నారు. ఆదివారం ఆయన నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. సింగరేణిలో యువతకు ఉపాధి లభించాలంటే కొత్తగనులు రావాలని, బొగ్గు గనుల వేలంలో సంస్థ పాల్గొనాలని కోరారు. ఖాళీగా ఉన్న క్లర్కులు, ఈపీ ఆపరేటర్స్, తదితర ఇంటర్నల్ పోస్టులను వెంటనే భర్తీ చేయాల న్నారు. ఎగ్జిక్యూటివ్ పోస్టులను 60శాతం(ఎక్స్‌టర్నల్), 40 శాతం(ఇంటర్నల్)గా కాకుండా, 40శాతం (ఎక్స్‌టర్నల్), 60శాతం(ఇంటర్నల్)గా ఇవ్వాలన్నారు. డిపెం డెంట్ల ఉద్యోగ వయస్సును 35నుంచి 40ఏళ్లకు పెంచేలా కృషి చేస్తామన్నారు. దీనివల్ల 600 మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. మారు పేర్ల మార్పిడి గురించి సీఎండీని కలిశామని, త్వరలో పేర్ల మార్పిడి జరుగుతుందన్నారు. మైనింగ్ స్టాఫ్‌కు సేమ్ జాబ్ ఇవ్వాలని, ఇంటి రుణాల మంజూరుతోపాటు వడ్డీ చెల్లించేలా చూస్తామన్నారు. సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పోస్టుల్లో అన్ని కేటగిరీలకు అవకాశం కల్పించాలని మేనేజ్‌మెంట్‌ను కోరామన్నారు. కొంతమంది మేనేజర్లు పాత గుర్తింపు యూనియన్ వారికి సహకరిస్తున్నారని, వారి విధానం మార్చు కోవాలని సూచించారు. సమావేశంలో యూనియన్ డిప్యూటీ కార్యదర్శి కె వీరభ ద్రయ్య, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, నాయకులు పాల్గొన్నారు.

ఓసీపీ-3ని సందర్శించిన కోల్ సెక్రెటరీ



సీహెచ్‌పీలో బొగ్గు రవాణాను పరిశీలిస్తున్న కోల్ సెక్రెటరీ, సీఎండీ

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 17: రామగుండం ఏరియా-2 పరిధిలోని ఓసీపీ-3 ప్రాజెక్టు సీహెచ్‌పీని ఆదివారం కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి విస్మితాతేజ్ సింగరేణి సీఎండీ బలరాంతో కలిసి సందర్శించారు. సీహెచ్‌పీ నుండి బొగ్గు రవాణా జరుగుతున్న ప్రీ వెబిన్ వ్యాగన్ లోడింగ్ సిస్టంను పరిశీలించారు. రోజుకు ఎన్ని ర్యాక్‌ల బొగ్గు రవాణా జరుగుతున్నది, త్వరితగతిన బొగ్గు రవాణా, పేమెంట్ విధానాన్ని స్థానిక అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వేసవిలో బొగ్గు అవసరాల దష్ట్యా బొగ్గు ఉత్పత్తి మరియు రవాణాకు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా చూడాల విస్మితాతేజ్ సూచించారు. వారి వెంట సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్, పా) ఎన్వీకే శ్రీనివాస్, ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ, ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ నరసింహారావు, సీహెచ్‌పీ ఇంచార్జి సదానందం, ఆర్జీ-1,2 సీనియర్ సెక్యూరిటీ అధికారులు వీరారెడ్డి, మహమ్మద్ షరీఫ్ తదితరులు ఉన్నారు.

సీహెచ్‌పీలో సమస్యలను పరిష్కరించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 17:ఓసీపీ-3 సీహెచ్‌పీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు సీహెచ్‌పీ ఇన్‌చార్జి సదానందంకు వినతిపత్రాన్ని అందజేశారు. సీహెచ్‌పీ ఆవరణలో విపరీతమైన దుమ్ముతో కార్మికులు శ్వాస తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. క్వారీ నుంచి తీసుకువచ్చే మండుతున్న బొగ్గు నుంచి విషవాయువులు వెలువడుతుండడంతో కార్మికులు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. ఫైర్ కోల్ రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీడర్ క్యాబిన్‌లో ఏసీలను ఏర్పాటు చేయాలని, వేసవిని దృష్టిలో ఉంచుకుని కార్మికులకు త్రాగునీటి కోసం వాటర్ కూలర్‌ను ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు. సర్ఫేస్ ఫీడర్‌లో రక్షణ చర్యలు తీసుకోవాలని, పెరిగిన మ్యాన్ పవర్‌కు తగినట్టు ప్లేడేలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న యాక్టింగ్ ప్రమోషన్స్(వ్యాగన్ లోడింగ్‌మజ్దూర్, లారీ మొఖద్దం, ట్రాలీ ఆపరేటర్, పంప్ ఆపరేటర్, టెండాల్) ఇవ్వాలని మెమొరాండంలో పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆర్జీ-2 బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, అసిస్టెంట్ సెక్రెటరీలు శ్యాంసన్, గంధం సాంబశివరావు, పిట్ సెక్రెటరీ సెగ్గం శంకర్, అసిస్టెంట్ సెక్రెటరీ అల్లి రమేష్, రాజ్‌కుమార్ ఉన్నారు.